సాక్షి మంచిర్యాల

ఆదివారం । 18 । ఆగస్టు । 2024

'రాష్ట్రంలోనే అతిపెద్ద సంఘం పీఆర్‌టీయూ టీఎస్'

దండేపల్లి: రాష్ట్రంలోనే అతిపెద్ద సంఘం పీఆర్‌టీయూ టీఎస్ అని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. దండేపల్లిలో శనివారం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రావనవేని రవి, ప్రధాన కార్యదర్శిగా మల్యాల మల్లేష్, అసోసియేట్ అధ్యక్షుడిగా యాగండ్ల గంగన్న, మహిళా ఉపాధ్యక్షురాలిగా రజినీ, కార్యదర్శిగా రామరాజు, మహిళా కార్యదర్శిగా జయప్రద ఎన్నికయ్యారు. రాసపల్లి రవి, కొండు జనార్దన్, మనోహర్, రమేష్ పాల్గొన్నారు.



గూడెంలో శ్రావణ వేడుకలు

దండేపల్లి: గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం శ్రావణ మాసం, త్రయోదశి భక్తుల రద్దీ నెలకొంది. 102 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. తూర్పు ఆగ్నేయం దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

కొండగట్టు అంజన్నను దర్శించుకున్న జిల్లా జడ్జి



కొండగట్టు ఆలయంలో జడ్జి శ్రీనివాసులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్నను మంచిర్యాల జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు లక్ష్మీనారాయణ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ఈవో రామకృష్ణారావు ప్రముఖులను శాలువాతో సత్కరించారు.

ఆరోగ్యశ్రీ సిబ్బంది వేతనాలు పెంచాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఆరోగ్యమిత్రలు

మంచిర్యాలటౌన్: ఆరోగ్యశ్రీలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని, డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్‌ను మిత్రలకు కల్పించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును కోరారు. ఈ మేరకు శనివారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఆరు నెలలుగా సమస్యలు పరిష్కరించాలని సీఎం, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, మంత్రి సీతక్కలకు వినతిపత్రం అందజేసినా స్పందించడం లేదని, దీంతో సమ్మెకు తాము నిర్ణయించామని తెలిపారు. సమస్యలను 14 రోజుల్లోపు పరిష్కరించేలా చూడాలని, లేనిపక్షంలో సమ్మె చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యమిత్రల సంఘం సభ్యులు శారద, సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల నిర్వహణపై సమీక్ష

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామం చొక్కారాంనగర్ రాంపూర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 1, 2 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శ్రీసరస్వతీ శిశు మందిరాలు, శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయాల్లోని విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారు. క్రీడాకారులు, శిక్షకులు, సేవకులకు వసతి, ఇతర సౌకర్యాల కల్పనపై సమీక్షించారు. సమావేశంలో విద్యాపీఠం ప్రాంత శైక్షణిక్ ప్రముఖ్ చక్రవర్తుల పురుషోత్తమాచర్యులు, మంచిర్యాల విభాగ కార్యదర్శి దహగాం గోవిందరావు, ప్రాంత ఖేల్ ఖూద్ ప్రముఖ్ భీంసేన్, విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ పూదరి సత్యనారాయణ, ప్రధానాచార్యులు రామన్న, ఖేల్ ఖూద్ ప్రబంధకులు పాల్గొన్నారు.

కార్గో ద్వారా రాఖీల పార్సిల్



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ జనార్దన్, అధికారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల బస్టాండులోని కార్గో ద్వారా రాఖీలను అక్కాచెల్లెళ్లు వారి సోదరులకు పంపించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ జనార్దన్ తెలిపారు. మంచిర్యాల బస్టాండులో కార్గో రాఖీ కౌంటర్‌ను శనివారం డిపో అసిస్టెంట్ మేనేజర్ దేవసాల, లాజిస్టిక్ ఇంచార్జి ఎన్.ఏ.రావు, ఎగ్జిక్యూటివ్ మహేశ్‌లతో కలిసి ప్రారంభించారు. రూ.50తో రాష్ట్రంలోని ఎక్కడికైనా అతి తక్కువ సమయంలో పంపవచ్చని, రూ.60తో ఇతర రాష్ట్రాలకు పంపించేందుకు అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మేం అర్హులం కాదా..?

- ఒక్క రోజే వందల సంఖ్యలో ఏఈవోలకు ఫోన్‌కాల్స్
- జాబితాలో పేర్లు లేవని రైతుల ఆవేదన
- జిల్లాలో రుణమాఫీపై వేలల్లో ఫిర్యాదులు



జన్నారం: కవ్వాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓ వైపు రుణమాఫీ సంబరాలు సాగుతుండగా.. మరోవైపు మాఫీ వర్తించలేదని వేల మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటి రెండు విడతల్లోనూ పేరు రాని రైతులు మూడో విడత జాబితా కోసం ఎదురు చూశారు. మూడో జాబితాలోనూ పేర్లు రాకపోవడంతో 'మేం రైతులం కాదా, మాకెందుకు మాఫీ కాలేదు. అన్ని అర్హతలున్నా ఎందుకు మాఫీ చేయడం లేదు..' అని వ్యవసాయ అధికారులకు ఫోన్లు చేసి ప్రశ్నిస్తున్నారు. శనివారం ఒక్క రోజే రెండు వందలకు పైగా ఫోన్‌కాల్స్ వచ్చాయని ఓ మండలానికి చెందిన ఏఈవో పేర్కొన్నారు. దీంతోపాటు కలెక్టరేట్‌లోని రుణమాఫీ గ్రీవెన్స్ సెల్‌కు 186 ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఫోన్‌కాల్స్, లిఖిత పూర్వకంగా వస్తున్న ఫిర్యాదులు వేల సంఖ్యలో ఉన్నాయి. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించి మొదటి విడతలో రూ.లక్షలోపు జిల్లాలో 28,749మందికి రూ.151,27,19,035, రెండో విడతలో రూ.లక్షన్నర జాబితాలో 14,104 మందికి రూ.175,43,83,912 మాఫీ చేసింది. రేషన్‌కార్డు లేక కుటుంబ నిర్ధారణ కాకపోవడం, పట్టాపాస్‌బుక్ లేకపోవడం, ఆధార్‌కార్డుకు లోన్ ఖాతాకు పేరులో తేడా ఉండడం, సొసైటీలు, బ్యాంకుల్లో జరిగిన తప్పులతో వేల మందికి రుణమాఫీ వర్తించలేదు. దీంతో మూడో విడతలోనైనా పేరు ఉంటుందేమోనని భావించారు. మూడో జాబితాను ఈ నెల 16న ప్రకటించగా 13,155 మంది రైతులను అర్హులుగా గుర్తించింది. మూడు విడతల్లో కూడా పేరు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దాదాపు రూ.20 వేల నుంచి రూ.2లక్షల వరకు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్న రైతులు 13వేల మంది వరకు ఉన్నారు. వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.



కలెక్టరేట్‌లోని టోల్ ఫ్రీ సెంటర్‌లో రైతుల ఫిర్యాదులు స్వీకరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

ఎక్కువగా ఉన్నది చెల్లించినా..

గత వానాకాలం సీజన్ జూన్, జూలైలో పంట రుణాలు తీసుకున్న రైతులు ఈ వానాకాలం సీజన్‌కు ముందు చెల్లించారు. కొందరు రైతులు రెన్యూవల్ చేయించుకున్నారు. బ్యాంకర్లు పంట రుణం కింద గరిష్టంగా ఒక రైతుకు రూ.లక్షల వరకు రుణాలు ఇస్తున్నారు. గత జూన్‌లో రుణం తీసుకున్న రైతు ఈ జూన్‌లో రుణం, వడ్డీ చెల్లించారు. కానీ ప్రభుత్వం విధించిన గడువు 2023 డిసెంబర్ 9వరకు రూ.2లక్షల రుణానికి వడ్డీ రూ.2వేల నుంచి రూ.3వేల వరకు అయ్యింది. డిసెంబర్ 9వరకు తీసుకున్న అసలు, వడ్డీ కలిపి రూ.2లక్షల 600 అయ్యింది. రైతులు జూన్, జూలైలో వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయించుకున్నారు. డిసెంబర్ 9నాటికి రూ.2లక్షలకు పైగా ఉందని మాఫీ నగదు పడలేదని చెబుతున్నారు.

టు బీ ప్రాసెస్

ప్రభుత్వం ప్రకటించిన అన్ని అర్హతలు ఉన్నా చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదు. తెల్ల రేషన్‌కార్డు ఉన్నా, కుటుంబంలో ఒక్కరే రుణం తీసుకున్నా, పట్టాపాస్‌పుస్తకం ఉన్నా, ఆధార్‌కార్డు, బ్యాంకు బుక్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఉన్న రైతులకు కూడా రూ.2లక్షలలోపు రుణమాఫీ కాలేదని వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు, రుణమాఫీ పోర్టల్‌లో పరిశీలిస్తుండగా టు బీ ప్రాసెస్ అని వస్తుందని అంటున్నారు.

ఇప్పటివరకు 56వేల మందికి..

గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ 59,670 మంది రైతులకు అమలు చేసింది. 2018 నుంచి 2023 డిసెంబర్ వరకు రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య దాదాపు 73వేలకు పెరిగింది. ప్రస్తుత ప్రభుత్వం మూడు విడతల్లో 56,006 మందిని అర్హులుగా గుర్తించి రూ.465,17,59,201 విడుదల చేసింది.

అర్హతలున్నా కాలేదు..



నేను ఏటా తెలంగాణ గ్రామీణ బ్యాంకులో పంట లోను తీసుకుని కడుతున్నా. గత వానా కాలంలో రూ.2లక్షలు తీసుకున్న. మాఫీ జాబితాలో పేరు లేదు. తెల్ల రేషన్‌కార్డు, పట్టా పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు ఉన్నాయి. మా ఇంట్లో నాకు తప్ప ఎవరికీ లోను లేదు. అర్హతలున్నా మాఫీ కాలేదు.

– కత్తెర్ల మల్లేష్, గ్రామం: కుందారం, మం: జైపూర్

రేషన్‌కార్డు లేదంటున్నారు..



2020లో రూ.41 వేలు పంట లోను తీసుకు న్నా. ఇప్పుడు రూ.43 వేల వరకు అయ్యింది. మొదటి రెండు జాబితా ల్లో పేరు రాలేదు. మూ డో విడతలోనైనా వస్తుందని చూస్తే రాలేదు. వ్యవసాయ అధికారులను అడుగుతే రేషన్‌కార్డు లేదు రాలేదంటున్నారు. రేషన్‌కార్డుకు సంబంధం లేకుండా మాఫీ అవుతుందన్నారు. ఇప్పుడేమో రేషన్‌కార్డు అంటున్నారు.

– ఎంబడి తిరుపతి, లక్సెట్టిపేట

కవ్వాల్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

- గుళికల మందు ప్యాకెట్‌ను లాక్కున్న రైతులు
- గ్రామ పంచాయతీ ఎదుట నిరసన

జన్నారం: రుణమాఫీ వర్తించలేదని మండలంలోని కవ్వాల్ గ్రామంలో రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. పంచాయతీ కార్యాలయం ఎదుట శనివారం రైతులు నిరసన వ్యక్తం చేయగా.. రైతు జక్కుల లచ్చన్న విషగుళికలు తినే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న రైతు అడ్డుకుని విష గుళికల ప్యాకెట్ లాక్కున్నాడు. ఏజెన్సీ గ్రామం కవ్వాల్‌లో 500 మంది వరకు రైతులు ఉంటారు. వీరిలో కొందరికి పట్టాలు ఉండగా, ఏజెన్సీ చట్టం ప్రకారం చాలామంది రైతుల భూములకు పట్టాలు లేవు. గతంలో పహాణీల ద్వారా రుణాలు ఇచ్చేవారు. ధరణి వెబ్‌సైట్ వచ్చాక పహాణీ కూడా ఇవ్వడం లేదు. పాత పహాణీలతో సకాలంలో రుణాలు చెల్లించిన వారికి రుణాలు ఇస్తున్నారు. ఈ క్రమంలో గత ప్రభుత్వ హయాంలో రుణమాఫీ చాలా మందికి వర్తించగా, తిరిగి రుణం పొందారు. ప్రస్తుతం గ్రామంలోని అనేకమంది గిరిజనేతర రైతులకు రుణమాఫీ కాలేదు. ఈ విషయ మై శనివారం పంచాయతీ కార్యాలయం ఎదుట ని రసన వ్యక్తం చేశారు. సుమారు 70మందికి రుణ మాఫీ జరగలేదని తెలిపారు. వీరిలో కొందరికి ప ట్టాలు ఉండగా, మరికొందరికి లేవు. పట్టాలు లేని వారికి మాఫీ వర్తించదా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రైతు జక్కుల లచ్చన్న విష గుళికలు తినే ప్రయత్నం చేయగా.. పక్కనే ఉన్న రైతు ప్యాకెట్ లాక్కున్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు గుమ్ముల సత్తన్న, మహమూద్ అలీఖాన్ తదితరులు కోరుతున్నారు. కాగా, ప్రత్యేక సర్వే చేసి ఏజెన్సీలో పట్టా లేని రైతుల వివరాలు తీసుకుంటామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఏవో సంగీత తెలిపారు.

లిస్టులో నా పేరు లేదు

మా భూమిపై రుణం తీసుకుంటున్నాం. తిరిగి చెల్లిస్తూ.. మళ్లీ తీసుకుంటున్నాం. సంవత్సరాల కాలం నుంచి ఇలా జరుగుతుంది. గత ముఖ్య మంత్రి కేసీఆర్ హయాంలో రుణమాఫీ జరిగింది. మళ్లీ గత సంవత్సరం రూ.2 లక్షలు రుణం తీసుకున్నాను. ఇప్పుడు ప్రభుత్వం ప్రకటించిన లిస్టులో నా పేరు లేదు. నేనేమి పాపం చేశాను. నాకెందుకు రుణమాఫీ కావడం లేదు. ఈ విషయంలో ఎవ్వరిని అడుగాలో తెలుస్తలేదు. – రైతు జక్కుల లచ్చన్న

రుణమాఫీ కాలేదు



నాకు మూడెకరాల పొలం ఉంది. కానీ నాకు పట్టాలేదు. మా తాతల కాలం నుంచి పొలం పండించుకుంటున్నాం. రూ.1.50 లక్షల రుణం తీసుకున్న. కానీ నాకు రుణమాఫీ కాలేదు. ఎందుకు కాలేదో అర్థం అయిత లేదు. అధికారులు రుణమాఫీ చేసి ఆదుకోవాలి. – కుమ్మరి మల్లయ్య, రైతు కవ్వాల్

అర్హులైన గిరిజనులకు పోడు భూములు

- హక్కులపై విధివిధానాల రూపకల్పన
- రాష్ట్ర అటవీ, సంక్షేమ శాఖ మంత్రి సురేఖ

మంచిర్యాలఅగ్రికల్చర్: పోడు భూముల్లో వ్యవసాయం చేస్తున్న అర్హులైన గిరిజనులకు హక్కుల కల్పనకు విధివిధానాల రూపకల్పన చేస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సురేఖ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి మంత్రి సీతక్క, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు ఎమ్మెల్యే, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి సురేఖ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తుల్లో అర్హులైన వారిని గుర్తించాలని, భూముల విషయంలో వివాదాలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క మాట్లాడుతూ అటవీ భూముల రక్షణపై అధికార యంత్రాంగం సమష్టిగా కృషి చేయాలని, వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో పోడు భూముల సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి శివ ఆశిష్ సింగ్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి గంగాధర్, అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపొందించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి



పాల్గొన్న అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి ఓటరు జాబితా, ఇంటింటా సర్వే నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 28 వరకు ప్రీ రివిజన్, 29 నుంచి రివిజన్ నిర్వహించాలని, మొదటి 30 రోజుల్లో ఇంటింటి సర్వే నిర్వహించి 18 ఏళ్లు నిండిన వారిని జాబితాలో నమోదు చేయాలని అన్నారు. సెప్టెంబర్ 15లోగా ఇంటింటి సర్వే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఓటర్ జాబితాపై ఇంటింటా సర్వే నిర్వహించి బీఎల్‌వో యాప్‌లో నమోదుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, భూసేకరణ ప్రత్యేకఅధికారి చంద్రకళ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి హరీశ్‌రాజ్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరీశ్‌చంద్రరెడ్డిలతో కలిసి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది, ప్రైవేట్ ఆస్పత్రుల యజమానులతో సీజనల్ వ్యాధులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్ట్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ కేసులు నమోదైతే జిల్లా వైద్యాధికారికి తెలియజేయాలని అన్నారు. పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని, ఉదయం 9 గంటల నుంచి అందుబాటులో ఉండాలని తెలిపారు. జిల్లాలో వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు ఎస్.అనిత, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ కోటేశ్వర్‌రావు, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ రమణ, జిల్లా డెంటల్ అసోషియేషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

అట్రాసిటీ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజలు పౌరహక్కులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు, జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డితో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అట్రాసిటీ పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు విచారణతోపాటు ఎఫ్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేస్తామని తెలిపారు.

మత్తు పదార్థాల నిర్మూలన బాధ్యతగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

కోటపల్లి: మత్తు పదార్థాల నిర్మూలనకు అందరూ బాధ్యత తీసుకోవాలని డీసీపీ భాస్కర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మత్తుపదార్థాల నిర్మూలనపై విద్యార్థులు, ఆర్ఎంపీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు కొంతమంది వ్యక్తుల స్వార్థం కారణంగా మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని అన్నారు. మాదక ద్రవ్యాలు విక్రయించే వారిపై దృష్టి సారించడమే కాకుండా తీసుకునే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి సాగు, విక్రయించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆర్ఎంపీలు తెలిసీ తెలియని వైద్యం చేసి ఇబ్బందులకు గురికావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ సుధాకర్, ఎస్సైలు రాజేందర్, శ్యాంపటేల్, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ప్రభుత్వ ఆసుపత్రి, ఎంసీహెచ్, ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రైవేటు వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన

- వైద్యులు, వైద్య సిబ్బంది నిరసనలు

మంచిర్యాలటౌన్: కోల్‌కత్తాలో మహిళా వైద్యురాలిపై హత్యాచారం ఘటనపై శనివారం మంచిర్యాలలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, ఆర్ఎంఓ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎంసీహెచ్ వైద్యులు, సిబ్బంది, జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. ఎంసీహెచ్ వైద్యులతో కలిసి లయన్స్ క్లబ్ మంచిర్యాల సభ్యులు ఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంసీహెచ్ డాక్టర్ ప్రియదర్శిని, నర్సింగ్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాల్‌మోహన్, కార్యదర్శి కారుకూరి చంద్రమౌళి, ప్రోగ్రాం చైర్మన్ వి.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమణ, కార్యదర్శి డాక్టర్ కేవీఎల్ఎన్ మూర్తి, కోశాధికారి డాక్టర్ కేఎంఎన్ శ్రీనివాస్, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

ఓపీ సేవలు బంద్

మంచిర్యాలటౌన్: డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఓపీ సేవలు నిలిపి వేశారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ సేవలు నిలిపివేశారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణ ఖాళీగా కనిపించింది. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఓపీ సేవలు నిలిచిపోవడంతో రోగులు కూడా రాకపోవడం గమనార్హం. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు అందించారు.

కొవ్వొత్తుల ర్యాలీ

మంచిర్యాలటౌన్: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌ను అత్యంత దారుణంగా హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ టీఎన్జీవోస్ సభ్యులు శనివారం సాయంత్రం మంచిర్యాలలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, కోశాధికారి ఏ.సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షులు కేజియా రాణి, శ్రీనివాస్, రామ్‌కుమార్, తిరుపతి, అంజయ్య, సంయుక్త కార్యదర్శులు సునిత, పద్మలత, ప్రభు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.



ర్యాలీలో టీఎన్జీవోస్ సభ్యులు

జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, డైట్‌లలో ఈ నెల 22, 23వ తేదీల్లో జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించాలని డీఈవో యాదయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం కార్యకలాపాలతో ఆకర్షణీయమైన, విద్యా కార్యక్రమాల ద్వారా దేశ యువతలో అంతరిక్ష పరిశోధనలపై లోతైన అవగాహనను పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో నిర్వహించిన కార్యకలాపాల సమాచారాన్ని ఫొటోలు, వీడియోలు, రీల్స్ తయారు చేసి నివేదిక రూపంలో ఎస్ఈఆర్‌టీ టీజీ మెయిల్, nationalspaceday24@gmail.comకు ఈ నెల 24 లేదా అంతకు ముందు పంపించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబును సంప్రదించాలని తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

చెన్నూర్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కోర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్) అధికారి డాక్టర్ కోటేశ్వర్‌రావు అన్నారు. శనివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కోల్‌కతాలో మెడికో విద్యార్థినిపై జరిగిన పాశవిక ఘటనకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి రోగులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం చెన్నూర్‌లో నూతనంగా నిర్మిస్తు న్న వంద పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల కాలం కావడంతో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రోగులకు సకాలంలో సరైన వైద్యం అందించాలని తెలిపారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వైద్యులు సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రి పనులు పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

లింగాపూర్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాథోడ్ కిషన్ (44) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఏడాదిగా వ్యవసాయ పనులు, ఇతర అవసరాల కోసం రూ.2 లక్షలు అప్పు చేశాడు. ఈక్రమంలో మద్యం మత్తులో గురువారం భార్యతో గొడవపడ్డాడు. దీంతో అతడి భార్య పక్కింటి సమీప బంధువుల ఇంటికి వెళ్లింది. అనంతరం కిషన్ గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సురేఖాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి రిమాండ్

దండేపల్లి: మండలంలోని ముత్యంపేటకు చెందిన కొండా నరేశ్‌ను రిమాండ్ చేసినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నరేశ్‌పై గతంలో పలు కేసులు నమోదు కావడంతో పాటు 2021లో రౌడీషీట్ కూడా ఓపెన్ చేశారు. అయినా అతనిలో మార్పు రాకపోవడం, ఇటీవల నెల్కి వెంకటాపూర్‌లో ఓ భూవివాదంలో తలదూర్చడంతో అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నకిలీ రిపోర్టర్ అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ నరేందర్

జన్నారం: ఓ ప్రైవేట్ పాఠశాల హెచ్‌ఎంను స్టాఫ్ రిపోర్టర్‌నంటూ డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. మండలకేంద్రానికి చెందిన జయరాణి పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్‌ను ఓ పత్రిక స్టాఫ్‌రిపోర్టర్‌ను అని నెన్నెలకు చెందిన రత్నం తిరుపతి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఈనెల 11న ఫిర్యాదు చేయడంతో ఆయనపై కేసు నమోదైంది. శనివారం తిరుపతిని అరెస్ట్ చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరిని శనివారం పట్టుకున్నట్లు టూటౌన్ ఎస్సై కే మహేందర్ తెలిపారు. రామకృష్ణాపూర్ రామాలయం ఏరియాకు చెందిన పొన్నాల వెంకటేశ్, వెంకటేశ్వరస్వామి గుడి ప్రాంతంలో నివాసముంటున్న కుంటాల అరవింద్ గంజాయి రవాణా చేస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వీరి నుంచి 82 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రయాణికుల భద్రతకు 'టీ-సేఫ్'

- క్యాబ్, ఆటోలపై పోలీస్ నిఘా
- అలర్ట్‌గా మహిళా భద్రతావిభాగం
- వినూత్న సేవలందిస్తున్న వైనం
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



టీ-సేఫ్ యాప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ శ్రీనివాసులు, అధికారులు


మంచిర్యాలక్రైం: ఒంటరిగా మహిళలలే కాదు.. పురుషులూ ప్రయాణం చేయాలంటే భయపడుతున్న ఈ రోజుల్లో మనం జీవిస్తున్నాం. ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదో తెలియడం లేదు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయణించాలని ఆర్టీసీ అధికారులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. బస్సు ప్రయాణం ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లాలన్నా.. ఇంటి నుంచి బస్టాండ్, మార్కెట్‌కు వెళ్లాలన్నా సామాన్య మధ్య తరగతి ప్రజలు ఆటోలు లేదా క్యాబ్‌ల్లోనే వెళ్లాల్సి ఉంటుంది. గతంలో కొందరు ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్ల చెడు ప్రవర్తనతో ప్రయాణికులు ఆటో డ్రైవర్లపై మంచి అభిప్రాయాన్ని కోల్పోయారు. దీంతో ఆటోలు, క్యాబ్‌ల్లో ప్రయాణించే మహిళలు, ఒంటరిగా ఉన్న ప్రతీ ఒక్కరికి భద్రత కల్పించేందుకు తెలంగాణ పోలీస్ సరికొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. మహిళలు, బాలికలు, ఇతర పౌరులు ఎవరైనా సరే ఒంటరిగా ప్రయాణం చేస్తున్నప్పుడు వారు సురక్షితంగా గమ్యం చేరేవరకు పర్యవేక్షించేలా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలోని మహిళా భద్రత విభాగం టీ-సేఫ్ (ట్రావెల్ సేఫ్) యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఏడాది మార్చి 12నుంచి యాప్ అమలులోకి రాగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు సుమారు 1,500 మందికి పైగా మహిళలు డౌన్‌లోడ్ చేసుకున్నారు. నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేయడానికి బదులు.. నేరం జరగకుండా నివారిస్తూ ప్రజలు, ముఖ్యంగా మహిళలకు అండగా నిలవడమే లక్ష్యంగా దేశంలోనే మొదటిసారి తెలంగాణ పోలీసులు ఈ తరహా ప్రయాణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్మార్ట్ ఫోన్లే కాకుండా సాధారణ ఫోన్ల నుంచి కూడా ఈ సేవలు పొందే అవకాశముండటం విశేషం.

మూడు రకాలుగా సేవలు

- **టీ-సేఫ్ యాప్ సేవలు:** స్మార్ట్ ఫోన్లున్న ప్రతి ఒక్కరూ గూగుల్ ప్లే స్టోర్ నుంచి టీ-సేఫ్-తెలంగాణ పోలీస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత అందులో సూచించినట్లు వివరాలు నమోదు చేయాలి. అంతే సదరు మహిళ/బాలిక/పౌరుడు సురక్షితంగా గమ్యం చేరేవరకు పోలీసులు లైవ్ ట్రాకింగ్ ద్వారా వాహనాన్ని పర్యవేక్షిస్తుంటారు. ఏదైన సమస్య ఎదురైతే వెంటనే రంగంలోకి దిగుతారు.
- **డయల్ 100:** దీనికి స్మార్ట్‌ఫోన్ అవసరం లేదు. సాధారణ ఫోన్ ఉన్నవారు ప్రయాణం ప్రారంభించే ముందు 'డయల్ 100'కు కాల్ చేయాలి. అందులో వచ్చే ఐవీఆర్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) ఆప్షన్‌లో 8వ నంబర్‌ను నొక్కాలి. వ్యక్తిగత వివరాలు, ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణిస్తున్నాం, ప్రయాణించే వాహనం నంబర్ లాంటి వివరాలు ఇస్తే సరిపోతుంది. వెంటనే ఒక కోడ్ నంబర్‌ను పెట్టుకోవాల్సిందిగా సూచిస్తారు. ఆ తర్వాత గమ్యం చేరేదాకా పోలీసుల నుంచి ప్రతీ 15 నిమిషాలకు మీకు అలర్ట్ మెస్సేజ్, మధ్యలో ఐవీఆర్ పద్ధతిలో ఫోన్ కాల్స్ వస్తుంటాయి. అప్పుడు ముందే పెట్టుకున్న కోడ్ ద్వారా ఆన్సర్ చేయాల్సి ఉంటుంది. ఆ ఫోన్‌లో ఇతరులు ఆన్సర్ చేసేందుకు అవకాశం లేకుండా ముందే సిద్ధం చేసి పెట్టుకున్న కోడ్ ఉపకరిస్తుంది. ఒక వేళ సరైన స్పందన లేకపోతే వెంటనే వాహనం వివరాలు, రూట్, లైవ్ ట్రాకింగ్ లింక్ ఆ పరిధిలోని పోలీస్ పెట్రోలింగ్ వాహనాలకు వెళ్తాయి. నిమిషాల వ్యవధిలోనే వారు సదరు వాహనం వద్దకు చేరుకుంటారు.
- **టీ-సేఫ్ వెబ్‌సైట్:** ప్రయాణం చేసే సమయానికి మన దగ్గర ఉన్న స్మార్ట్ ఫోన్‌లో యాప్ లేదనుకోండి. https:// tsafe. tspolice. gov. in/ wap/ వెబ్‌సైట్‌ను ఉపయోగించవచ్చు. ఇందులోకి లాగిన్ అయిన తర్వాత.. ఎక్కడికి వెళ్లాలి?.. పేరు.. జెండర్.. మొబైల్ నంబర్.. ప్రయాణిస్తున్న వాహనం.. వాహన్ నంబర్ నమోదు చేయాలి. ఆ తర్వాత స్మార్ట్ మై ట్రిప్ ఆప్షన్ ఓకే చేయాల్సి ఉంటుంది. అంతే ప్రయాణికుడు లేదా ప్రయాణికురాలు గమ్యం చేరేదాకా పోలీసులు పర్యవేక్షిస్తుంటారు.

అవగాహన కార్యక్రమాలతో..

మహిళల భద్రత, ప్రయాణికుల రక్షణ కోసం రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు షీ టీమ్ ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టీ-సేఫ్ సేవలకు ప్రచారం కల్పిస్తూ మహిళా భద్రత విభాగం రూపొందించిన వీడియో రాష్ట్ర వ్యాప్తంగా వైరల్‌గా మారింది. వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రజలు దీనిని వీక్షిస్తున్నారు. సురక్షిత ప్రయాణంపై అవగాహన పెంచుకుంటున్నారు. ఆటోలు, క్యాబ్‌లలో ప్రయాణం చేస్తున్నప్పుడు టీ-సేఫ్ యాప్‌ను ఉపయోగించుకుంటే ప్రయాణం పూర్తయ్యేదాకా నిర్ణీత సమయంలో పోలీసుల నుంచి అలర్ట్ ఎస్‌ఎంఎస్‌లు, ఫోన్‌కాల్స్ వస్తుండడంతో ప్రయాణికులు ఎలాంటి అభద్రతాభావం, ఆందోళన లేకుండా ప్రయాణించవచ్చని అధికారులు చెబుతున్నారు. పౌరుల ప్రయాణాన్ని పోలీసులు నిజంగానే పర్యవేక్షిస్తున్నారా..?లేదా..? అని పరీక్షించేందుకు కూడా కొందరు టీ-సేఫ్ సేవలను వినియోగిస్తున్నారని అధికారులు వివరించారు.



టీ-సేఫ్ యాప్

ప్రయాణికుల భద్రత కోసమే..



ఒంటరిగా ప్రయాణంచేసే మహిళలకు/పురుషులకు భద్రత కల్పించేందుకు పోలీస్ భద్రత విభాగం అధికారులు టీ-సేఫ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఒంటిరిగా ప్రయాణించేవారు.. ప్రయాణిస్తున్న వివరాలను టీ-సేఫ్ యాప్‌లో ఎంట్రీ చేయగానే ప్రయాణం పూర్తయ్యేదాకా పర్యవేక్షిస్తుంటారు. ఒంటరిగా ప్రయాణించే వారికి ఇది భద్రతగా ఉంటూ రక్షణ కల్పిస్తుంది. ఏదైన అపాయం ఎదురైతే పోలీసులు వెంటనే పసిగట్టి ఘటనాస్థలానికి చేరుకుని ఆకతాయిల ఆట కట్టిస్తారు. మహిళలు, ఒంటరి ప్రయాణికులు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాసులు, రామగుండం సీపీ

నేడు విద్యుత్ అంతరాయం

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని శ్రీరాంపూర్ డీజీఎం పర్సనల్ అరవిందరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మందమర్రిలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి కాలనీలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. కార్మిక కుటుంబాలు సహకరించాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికుడికి గాయాలు



కాలి గాయంతో మల్లయ్య

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో శనివారం మొదటి షిఫ్టులో బెల్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పూదరి మల్లయ్యగౌడ్ అనే కాంట్రాక్ట్ కార్మికుడికి గాయాలయ్యాయి. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. అధికారుల ఆదేశాల మేరకు మల్లయ్యగౌడ్‌కు బెల్ట్ క్లీనింగ్ పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు బొగ్గు పెల్ల మల్లయ్య కాలిపై పడటంతో తీవ్రగాయమైంది. వెంటనే అధికారులు అతడిని గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదంలో మల్లయ్య కాలి ఎముక విరగగా వైద్య సిబ్బంది పట్టీవేసి ఇంటికి పంపించారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

గోలేటి సీహెచ్‌పీలో అధికారులు కార్మికుల రక్షణను పూర్తిగా గాలికి వదిలేశారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఓ ప్రకటనలో ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యంతో గోలేటి సీహెచ్‌పీలో బెల్ట్‌వద్ద విధులు నిర్వహిస్తున్న మల్లయ్యగౌడ్‌కు గాయాలయ్యాయని పేర్కొన్నారు. వానాకాలం కావటంతో బెల్ట్ వద్ద విధులు నిర్వహించే సమయంలో అధికారులు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాల్సి ఉన్నా పట్టించుకోకపోవటంతోనే ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. ప్రమాదానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'బీఆర్ఎస్ మాటలు నమ్మొద్దు'



బస్సులో మహిళలతో మాట్లాడుతున్న సుగుణ

జన్నారం: రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులు చెబుతున్న మాటలు నమ్మొద్దని, అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంటరీ నాయకురాలు ఆత్రం సుగుణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ అర్హులందరికీ జరిగిందని, ప్రత్యేక సర్వే చేపట్టి చిన్నచిన్న తప్పిదాలతో మాఫీ రాని రైతులకూ వర్తింపజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో అమలు చేస్తుంటే ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్ భేషరతుగా మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

బస్సెక్కి.. మహిళలతో మాట్లాడి..

ఆత్రం సుగుణ తన పుట్టినిల్లయిన తిమ్మాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తపాలాపూర్‌లో బస్సు ఎక్కి జన్నారం వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా బస్సులో మహిళలతో మాట్లాడారు. రాఖీ పండుగ సందర్భంగా అనేకమంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకోవడంపై హర్షం వ్యక్తంజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు రాజశేఖర్, శంకరయ్య, కాంతామణి, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్సెంటివ్ ఇప్పించాలి



కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న నేతలు

శ్రీరాంపూర్: లక్ష్యానికి తగినట్లు బొగ్గు తీసినా తమకు ఇన్సెంటివ్ రావడం లేదని ఆర్కే 6 గని కార్మికులు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులకు మొర పెట్టుకున్నారు. శనివారం యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఇన్సెంటివ్ విధానం సరిగా లేక తాము నష్టపోతున్నామని కార్మికులు తెలిపారు. దీనిపై తాము యాజమాన్యంతో మాట్లాడుతామని ఏఐటీయూసీ నేతలు హామీ ఇచ్చారు. ఉద్యోగుల పర్సనల్ రికార్డులకు సంబంధించి యాజమాన్యం కొత్తగా తీసుకువచ్చిన యాప్‌ను ఎలా వినియోగించుకోవాలో ఏఐటీయూసీ నేతలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనియన్ పిట్ సెక్రటరీ సంగం సదానంద, నాయకులు కారుకూరి నగేశ్, బాలసారి లక్ష్మణ్, రాంచందర్, సాయిబాబా, అద్దు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో యువకుల వీరంగం





గాయపడ్డ సాయితేజ, దుర్గయ్య

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ మద్యం దుకాణంలో ఇద్దరు యువకులు శనివారం రాత్రి బీరు సీసాలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. సీఐ బన్సిలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వొడ్డెర కాలనీకి చెందిన గుంజ సాయితేజ, ముప్పు దుర్గయ్య ఇద్దరూ తెలిసిన వ్యక్తులు కావడంతో స్థానిక వైన్‌షాపులో మద్యం సేవిస్తున్నారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. దుర్గయ్య, సాయితేజ బీరు సీసాలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో సాయితేజ కడుపుపై బీరు సీసాతో పొడిచేందుకు ప్రయత్నించగా గాయాలయ్యాయి. దుర్గయ్యకు కాలుపై స్వల్ప గాయాలయ్యాయి. వీరిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ప్రాణాపాయ గాయాలు కాలేదని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక సీఐ బన్సిలాల్‌ను వివరణ కోరగా మద్యం మత్తులో ఇరువురు దాడి చేసుకున్న ఘటన తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇరువురి వివరాలు సేకరించి దర్యాప్తు చేయనున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఐబీపీ పెట్రోల్ పంపు వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు మండల కేంద్రంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చంద్రమౌళి, మహారాష్ట్రలోని బల్లర్పూర్‌కు చెందిన అర్బాస్‌ఖాన్ బైకులో గంజాయి తరలిస్తుండగా ఏఎస్సై రాజయ్య, సిబ్బంది వెంబడించారు. వారిని అదుపులోకి తీసుకుని 240 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రెండు బైకులను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని ఒకరు మృతి

బెల్లంపల్లి: టీ తాగడం కోసం జాతీయ రహదారిని దాటుతుండగా అతి వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన ఓ కారు ఢీకొట్టడంతో దినసరి కూలీ మృతి చెందాడు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి గంగారాంనగర్ బస్తీకి చెందిన కొమ్ము శివకుమార్ (32) శనివారం ఉదయం పనిమీద బజారు ఏరియాకు వెళ్లడానికి అవతలి వైపు నుంచి రోడ్ క్రాస్ చేశాడు. రోడ్డు పక్కకు బైక్ పార్కింగ్ చేసిన శివకుమార్ తిరిగి గాంధీనగర్ వైపు ఉన్న ఓ హోటల్‌లో టీ తాగడానికి డివైడర్ మీదుగా రోడ్ దాటుతున్నాడు. ఈక్రమంలో తాండూర్ వైపు నుంచి మంచిర్యాల వైపునకు వెళ్తున్న కారు డ్రైవర్ దీపక్ అతివేగంగా, అజాగ్రతగా నడిపి ఢీకొట్టడంతో శివకుమార్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సత్యవతి క్యాన్సర్ పేషెంట్ కాగా, ఐదేళ్ల కొడుకున్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

జ్వరంతో మహిళ మృతి



చెన్న లక్ష్మి (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ పరిధి చందనాపూర్ గ్రామానికి వివాహిత చెందిన చెన్న లక్ష్మి (50) జ్వరంతో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చందనాపూర్ గ్రామానికి చెందిన చెన్న లక్ష్మి రోజు కూలీ. వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ లక్సెట్టిపేటలోని ఓ ప్రైవేట్ వైద్యుడి వద్ద చికిత్స పొందుతోంది. శుక్రవారం లక్ష్మికి ఒక్కసారిగా జ్వరం తీవ్రం కాగా హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన మరో ప్రైవేట్ వైద్యుడి వద్ద చికిత్స తీసుకుంటూ ఫిట్స్‌కు గురైంది. దీంతో లక్ష్మిని బంధువులు వెంటనే మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి మరింత విషమంగా మారడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు లక్ష్మిని పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త రాయలింగు ఉన్నాడు. నలుగురు కుమార్తెలుండగా అందరికీ వివాహాలయ్యాయి.

108 పైలెట్లకు పురస్కారం



పైలెట్లను అభినందిస్తున్న సామ్రాట్

లక్సెట్టిపేట: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ రాష్ట్ర వ్యాప్తంగా 108 అంబులెన్స్‌లో పనిచేస్తున్న పలువురిని ఉత్తమ పైలెట్లుగా ఎంపిక చేసింది. అందులో లక్సెట్టిపేట 108 అంబులెన్స్‌లో స్టార్ పైలెట్లుగా పనిచేస్తున్న కముటం గంగన్న, మామిడి సత్యం ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు హైదరాబాద్‌లో ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. వారిద్దరినీ 108 అంబులెన్స్‌ల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి సంపత్, తోటి పైలెట్లు అభినందించారు.

సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

బెల్లంపల్లి: సింగరేణి కంపెనీకి ట్రాన్స్‌కో, జెన్‌కోలు బకాయిపడ్డ రూ.29 వేల కోట్లు వెంటనే చెల్లించే ఏర్పాట్లు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వీ సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. కొన్నేళ్లుగా ట్రాన్స్‌కో, జెన్‌కో విద్యుత్ సంస్థలు సింగరేణికి పెండింగ్ బిల్లులు చెల్లించకుండా తీవ్ర కాలయాపన చేస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో భూగర్భ గనులను ప్రారంభించేందుకు యాజమాన్యం గతంలోనే సర్వే చేయించి సిద్ధంగా ఉంచిందని పేర్కొన్నారు. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల్లో భూగర్భంలో అపారమైన బొగ్గు నిక్షేపాలున్నాయని సర్వే ద్వారా నిర్ధారణ అయిందని చెప్పారు. సింగరేణిలో ఏటా కార్మికుల సంఖ్య తగ్గుముఖం పడుతోందని ఈక్రమంలో సర్వే చేసిన ప్రాంతాల్లో భూగర్భ గనులను ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి ఆర్థిక భరోసా ఇవ్వాలని కోరారు. శ్రావణ్‌పల్లి బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే కార్మికులకు లాభాల వాటా 35శాతం చెల్లించేలా చూడాలని కోరారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లను జారీ చేయించామని వివరించారు. కార్మికులకు విధించిన ఇన్‌కం టాక్స్‌ను వెంటనే రద్దు చేయాలని ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ సింగరేణి విభాగం బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు దాసరి తిరుపతిగౌడ్, రెండు బ్రాంచ్‌ల ఇన్‌చార్జి చిప్పనర్సయ్య, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.వెంకటస్వామి, నాయకులు రమేశ్, రాంచందర్, రత్నపం ఐలయ్య, సంతోష్, శ్రీనివాస్, ప్రవీణ్, రాజలింగు, శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఉత్సాహంగా సాగాలి



ఖమ్మం వాలీబాల్ జట్టుకు ట్రోఫీ ఇస్తున్న అధికారులు



క్యారం విజేత జాకీర్‌కు ట్రోఫీ ఇస్తున్న అధికారులు

ఆదిలాబాద్: విద్యుత్ ఉద్యోగులు క్రీడల్లో రాణించినట్లే విధి నిర్వహణలోనూ ఉత్సాహంగా సాగాలని ఆదిలాబాద్ విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్, నిర్మల్ ఎస్‌ఈ శ్రీనివాస్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి వాలీబాల్, క్యారం పోటీలు శనివారం ముగిశాయి. విజేతలుగా నిలిచిన జట్లకు వారు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని తెలిపారు. నిత్యం విద్యుత్ సరఫరా విషయంలో బిజీబిజీగా ఉండే ఉద్యోగులకు క్రీడల నిర్వహణ ఎంతో ఉత్సాహపూరిత వాతావరణాన్ని కలిగించిందని చెప్పారు. విద్యుత్ శాఖలోనూ ఎంతో ప్రతిభగల క్రీడాకారులున్నారని, ప్రోత్సాహన్నిస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, సెక్రటరీ శ్రీనివాస్, అధికారులు జీవరత్నం, దేవాగౌడ్, హరికృష్ణ, నాగరాజు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

వాలీబాల్ విజేతగా ఖమ్మం, రెండో స్థానంలో మహబూబ్‌నగర్, మూడో స్థానంలో ఆదిలాబాద్ నిలిచింది. ఇక క్యారం టీం ఈవెంట్లో విద్యుత్ సౌధ జట్టు మొదటి స్థానం, రెండో స్థానంలో నిజామాబాద్, మూడో స్థానంలో మెట్రోజోన్ హైదరాబాద్ జట్లు నిలిచాయి. ఓపెన్ సింగిల్స్‌లో జాకీర్ (మెట్రో జోన్, హైదరాబాద్) విజేతగా నిలిచాడు. ఓపెన్ డబుల్స్ ఈవెంట్లో మొదటి రెండు స్థానాల్లో మెట్రో జోన్ హైదరాబాద్ నిలువగా, మూడో స్థానంలో విద్యుత్ సౌధ జట్లు నిలిచాయి.

గురుకుల పాఠశాలల తనిఖీ



కమిషనర్‌కు ఎలర్జీ చూపిస్తున్న విద్యార్థులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల, సాంఘిక సంక్షేమ బాలబాలికల పాఠశాల, కళాశాలలను శనివారం మున్సిపల్ కమిషనర్ గంగాధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో నలుగురు విద్యార్థులు ఎలర్జీ, ఇద్దరు విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలుసుకున్నారు. ఫ్యాన్లు, బాత్‌రూమ్ డోర్లు లేవని విద్యార్థులు తెలిపారు. దీంతో సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కుళ్లిన కూరగాయలు, పురుగులు పడిన శనగపిండి బస్తాలు ఉండడంతో అధికారులు, నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ విజిట్ చేసేనాటికి మార్పు కనిపించకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని హెచ్చరించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, పరిస్థితుల గురించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంట ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, వార్డు ఆఫీసర్ తిరుపతి, ప్రిన్సిపాల్‌లు, వార్డెన్లు ఉన్నారు.